క్లుప్తంగా

ఎక్సైజ్ ఎస్సైకి వినతి

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఉన్న వైన్స్ షాపులను ప్రస్తుతం ఉన్న చోటు నుంచి మరో చోటుకు మార్చాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తోళ్ల సురేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ఎక్సైజ్ ఎస్సైకి వినతి పత్రం అందించారు. కూసుమంచి–నేలకొండపల్లి రహదారి వైపు కాలేజీలు ఉండడం వలన విద్యార్థినులు వైన్స్ షాపుల నిర్వహణతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ మండల కమిటీ ఎన్నిక

కామేపల్లి: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) కామేపల్లి మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అతహస్సమ్, ఉపాధ్యక్షుడిగా శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి సంతోష్, సహాయ కార్యదర్శి నందు, కోశాధికారి కుందన, కమిటీ సభ్యులుగా వరలక్ష్మి, అక్షయ, ప్రవీణ్, వర్ధన్, ముకేశ్, ఉమేష్‌లను ఎన్నుకున్నట్లు ఖమ్మం జిల్లా కార్యదర్శి వెంకటేశ్ తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై సురేశ్

ఖమ్మంరూరల్: ఖమ్మంరూరల్ ఎస్సైగా సురేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన వెంకటకృష్ణ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో టాస్క్‌ఫోర్స్ నుంచి సురేశ్ ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల సహకారంతో మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సురేశ్ పేర్కొన్నారు.

వైద్య సేవలను వినియోగించుకోవాలి

కామేపల్లి: ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయ భాస్కరరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాతలింగాల గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు కార్పొరేట్‌స్థాయిలో వైద్యం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ భూక్యా తారాదేవి, ఏపీఓ శ్రీరాణి, డాక్టర్ వైష్ణవి, ఏఎన్ఎం సునీత పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన


రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్

ఖమ్మంఅర్బన్: నగరంలోని 9, 10 డివిజన్లలో సీసీ రోడ్ల నిర్మాణ పనుల నాణ్యతను నగర కమిషనర్ ఆదర్శ్ సురభీ బుధవారం పరిశీలించారు. సిమెంట్‌రోడ్డు నిర్మాణం కోర్‌కటింగ్ ద్వారా నాణ్యతతో పాటు రోడ్ల పొడవు, వెడల్పులను పరిశీలించి శాంపిళ్లు సేకరించారు. రికార్డులను అనుగుణంగా నిర్మాణాలు ఉన్నాయా అని ఆరా తీశారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	హాయ్ నాన్న
సాయిరాం	డెవిల్
ఆదిత్య	యానిమల్
శ్రీనివాస	సలార్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	3
వంకాయ	46		10
బెండకాయ	60	పాలకూర	3
పచ్చిమిర్చి	40		20
కాకర	60	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	56	తోటకూర	3
దొండ	50		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	110		10
గోరుచిక్కుడు	60	మెంతికూర	2
క్యాబేజీ	24		10
క్యాలీఫ్లవర్	36	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		30
చామగడ్డ	56	పుదీన	1
క్యారెట్	48		20
క్యాప్సికం	80	-ఖమ్మం వ్యవసాయం	

ప్రశాంతంగా ప్రజాపాలన

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం బుధవారం ఐదో రోజుకు చేరగా.. దరఖాస్తుల స్వీకరణ ప్రశాంతంగా జరిగింది. ప్రతీ దరఖాస్తు స్వీకరణ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్ సౌకర్యం తదితర మౌలిక వసతులు కల్పించడంతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రజలు పోటెత్తారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


రఘునాథపాలెం: మంచుకొండలో దరఖాస్తులు అందించడానికి వచ్చిన ప్రజలు


నేలకొండపల్లి: బోదులబండ గ్రామసభలో పోటెత్తిన ప్రజలు


నేలకొండపల్లి: మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రమణ


కామేపల్లి: పింజరమడుగులో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు


కూసుమంచిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు


కూసుమంచి: దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీరాం


రఘునాథపాలెం: దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి విజయకుమారి


రఘునాథపాలెం: బూడిదంపాడులో దరఖాస్తు రశీదు అందిస్తున్న తహసీల్దార్ లూథర్ విల్సన్


రఘునాథపాలెం: కేంద్రాల వద్ద దరఖాస్తులు పూర్తి చేస్తున్న సిబ్బంది


తిరుమలాయపాలెం: ఇస్లావత్‌తండాలో స్వీకరిస్తున్న తహసీల్దార్ రామ్‌ప్రసాద్

నేటి గ్రామ సభలు..

ఖమ్మంమయూరిసెంటర్/రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన గురువారం కేఎంసీ పరిధిలోని ఏడు డివిజన్లలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇందు కోసం ఆయా డివిజన్లలో ఏర్పాటు చేసిన లోకేషన్‌ల వివరాలను కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి వెల్లడించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలు ఈ కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. అలాగే రఘునాథపాలెం మండలంలోని రాములుతండా, రేగులచలక, పంగిడి, ఎన్వీబంజర పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించబడతాయని ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఖమ్మం నగరంలోని 41వ డివిజన్ సీక్వెల్‌రోడ్, చెరువుబజార్‌లో, 43 డివిజన్ రేవతి సెంటర్‌లో, 44 డివిజన్ శ్రీరామ్ నగర్‌లో, 46 సారథినగర్ కేంద్రాలు దరఖాస్తులు స్వీకరించనున్నారు. అదేవిధంగా 47 డివిజన్ కాల్వొడ్డు, మంచికంటి నగర్, బొక్కలగడ్డలో, 48 వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్‌లో, 49 మామిళ్ల గూడెంలో దరఖాస్తులు స్వీకరించనున్నారు.

మిర్చి రైతుల క్షేత్రస్థాయి ప్రదర్శన

కూసుమంచి: మండలంలోని పోచారం గ్రామంలో బుధవారం ఎన్నార్సై సీడ్స్ కంపెనీ వారి ఆమని విత్తన రకం సాగుచేసిన రైతు చేలో క్షేత్రస్థాయిలో ప్రదర్శన నిర్వహించారు. ఈ రకం దిగుబడులు, నాణ్యతను కంపెనీ రీజినల్ మేనేజర్ వూశయ్య వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామసహాయం వెంకటరెడ్డితో పాటు వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.


క్షేత్రస్థాయి ప్రదర్శనలో పాల్గొన్న రైతులు

సావిత్రీబాయి జీవితం ఆదర్శం

భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సేవకురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం వివిధ సంఘాలు, పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, కార్యాలయాల్లో పూలే చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రీబాయి జీవితం మహిళా లోకానికే ఆదర్శమని పలువురు పేర్కొనగా.. జనవరి 3వ తేదీని జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. - సాక్షి నెట్‌వర్క్


నేలకొండపల్లిలో నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు


ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన నివాళులర్పిస్తున్న నాయకులు


కూసుమంచి: విద్యార్థి సంఘం ఆధ్వర్యాన విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


ఖమ్మంరూరల్: నాయుడుపేటలో కేవీపీఎస్ ఆధ్వర్యాన నివాళి


ఖమ్మంమామిళ్లగూడెం: నివాళులర్పిస్తున్న మాలమహానాడు నాయకులు


కామేపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు వితరణ


బ్యాగులు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గుట్టలబజార్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన రూ. 12 వేల విలువైన బ్యాగులు, పుస్తకాలు, పెన్నులు, ప్యాడ్లు, వాటర్ బాటిళ్లను బుధవారం పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు దుర్గా నాగేశ్వరరావు, మల్లికార్జున్, శివరామకృష్ణల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి, జోన్ చైర్మన్ డాక్టర్ డీపీసీ రావు, సభ్యులు అవోపా కృష్ణమూర్తి, కొంకిమళ్ల విశ్వేశ్వరరావు, మాటేటి రవి, సోమశేఖర్, ఏటుకూరి శ్రీనివాసవాసరావు, పాఠశాల హెచ్ఎం రవికుమార్, కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింహారెడ్డిలతో పాటు సరస్వతి నాయక్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల అసోసియేషన్ క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని ముస్తఫానగర్‌లో ఖమ్మం కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు యుగంధర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించగా, రానున్న రోజుల్లో ప్రభుత్వంతో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చామకూర వెంకన్న, వడ్డెబోయిన నర్సింహారావు, అనుగోజు శ్రీనివాసరావు, సోమరాజు, నాగరాజు, వీరబ్రహ్మచారి, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ ఈ–కేవైసీ ఇంటి వద్దే చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఎల్‌పీజీ గ్యాస్ కనెక్షన్ల ఈ–కేవైసీని గ్యాస్ వినియోగదారుల ఇంటివద్దే ఆన్‌లైన్ చేయాలని సీపీఎం ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా శ్రీకాంత్ కోరారు. బుధవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కేవైసీ కోసం వినియోగదారులు ఏజెన్సీల దగ్గరకు వచ్చి అక్కడక్యూలో నిల్చున్నప్పుడు కనీస మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్యాస్ వినియోగదారుడి ఇంటివద్దనే కేవైసీ పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, ఎంఏ జబ్బార్, ఎస్‌కె.మీరా, బోడపట్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న యర్రా శ్రీకాంత్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను బుధవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, నవగ్రహ పూజలు హోమాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని నాభిశిల, ముత్యాలమ్మతల్లి, కట్టమైసమ్మతల్లి విగ్రహాల వద్ద పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆలయ నిర్మాణానికి రూ.10వేలు విరాళం

ఖమ్మంఅర్బన్: నగరంలోని నాలుగో డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్‌లో శ్రీఅంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునర్నిర్మాణానికి నగరంలోని పాండురంగాపురంకు చెందిన అప్పం రాము, సరస్వతి దంపతులు రూ.10,116లను బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యాక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందించాక రశీదు అందిస్తున్న దృశ్యం

8 నుంచి నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు


సమావేశంలో పాల్గొన్న రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు

ఖమ్మం మామిళ్లగూడెం: రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సంచార ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వెలిగేటి చంద్రమోహన్, వైస్ చైర్మన్ ఆర్.రవీందర్‌రావు తెలిపారు. బుధవారం వీడీఓస్ కాలనీలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 8 నుంచి జిల్లాలోని అన్ని గ్రామాల్లో నిరుపేదల కోసం ఉచిత వైద్య, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించనున్నట్లు వారు తెలిపారు. దీనికి సభ్యులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రతినిధి సాదినేని జనార్దన్‌రావు, సంస్థ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి సూర్యప్రకాశరావు, కోశాధికారి గోవర్ధన్, సభ్యులు సత్యనారాయణరెడ్డి, రాధాకృష్ణ, నరసయ్య, రాఘవయ్య, కుటుంబరావు, శ్రీహరి, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తిదారులకు అండగా మోదీ సర్కార్

నేలకొండపల్లి: కేంద్రంలో పేదల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం ఓ లక్ష్యంతో ముందుకు సాగుతుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బోదులబండలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా ఉచిత వైద్యం, విశ్వకర్మ యోజన ద్వారా చేతివృత్తిదారులు ఆర్థికంగా ఎదిగేందుకు మోదీ అండగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనగాని అనిత, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనంతు ఉపేందర్, మోహినుద్దీన్, ఉదయ్, చల్లా మల్లేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


బోదులబండలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

మోదీయే మరోమారు ప్రధాని..

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రధాని నరేంద్రమోదీ మరోమారు అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ రమేశ్ అన్నారు. బుధవారం ఖమ్మంలోని గొల్లగూడెంరోడ్‌లో నూతనంగా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయాన్ని కార్యకర్తలతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత పథకాలు, ప్రాజెక్టుల పేరుతో ఆర్థిక దుర్వినియోగం చేస్తుంటే, కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, నరేంద్ర బాబు, జిల్లా నాయకుడు డాక్టర్ జి.వెంకటేశ్వర్లు, అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్, ఉపాధ్యక్షులు మంద సరస్వతి, చంద్రశేఖర్, మోహన్ రెడ్డి, వెంకట్, సుధాకర్,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పేరుకే టాయిలెట్లు..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న టాయిలెట్లు నిర్మించి ఏడాది దాటింది. రూ. లక్షలు వెచ్చించి నిర్మించినప్పటికీ నేటికి ప్రారంభం కాలేదు. త్రీటౌన్ ప్రాంతంలోని గోళ్లపాడు చానల్‌పై పలు పార్కులు నిర్మించగా.. అందులో ఏడాది క్రితం ప్రొఫెసర్ జయశంకర్ పార్కు (600 మీటర్ల పొడవుగలది) పెద్దది. సుమారు రూ. 2 కోట్లకు పైగా వ్యయంతో మూడెకరాలకు పైగా ఉన్న స్థలంలో నిర్మించి అందులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు, మెగా చెస్ బోర్డు, స్కేటింగ్ ట్రాక్ వంటి అనే సౌకర్యాలు కల్పించారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దలు, చిన్నారులతో కళకళలాడుతుంటుంది. కానీ పార్కులో టాయిలెట్లు అందుబాటులో లేకపోవడంతో కొందరు తిరిగి వెళ్తుండగా, మరికొందరు నచ్చిన చోట మూత్ర విసర్జన చేస్తున్నారు. టాయిలెట్లు ఉన్నా.. లేనట్లుగానే ఉన్నాయని, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం వీడి టాయిలెట్లను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు. - ఖమ్మం వైద్యవిభాగం